
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 4 ఏప్రిల్ 2025

రోగి ప్రాణం తీసిన అగ్ని ప్రమాదం

- రెండు పూరిళ్లకు మంటలు
- పక్షవాతంతో కదలలేని స్థితిలో ఉన్న వ్యక్తి సజీవ దహనం
- భద్రాద్రి జిల్లా టీడీ బంజరలో ఘటన



గౌస్ పాషా (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అర్ధ రాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న సమయం లో ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో రెండు పూరిళ్లు దగ్ధం కాగా, మంటల్లో చిక్కుకొని పక్షవాతంతో కదలలేని స్థితిలో ఉన్న ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ టీడీ బంజరలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టీడీ బంజర గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో షేక్ గౌస్ పాషా (40)అనే వ్యక్తి ఇంట్లోని విద్యుత్ స్విచ్‌బోర్డులో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. మంటల సెగతో మేల్కొన్న గౌస్‌పాషా భార్య హసీనా తన ముగ్గురి పిల్లలను తీసుకొని వెంటనే ఇంటినుంచి బయటకు పరుగులు తీసింది. ఇంటి వసారాలో నిద్రిస్తున్న గౌస్ పాషా తల్లిదండ్రులు కూడా అగ్ని ప్రమాదాన్ని గమనించి బయటకు వచ్చారు.

అయితే పక్షవాతంతో కాలు, చేయి పనిచేయని స్థితిలో ఉన్న గౌస్‌పాషా ఇంట్లో నుంచి బయటకు రాలేకపోవడంతో మంటల్లో చిక్కుకున్నాడు. కుటుంబ సభ్యులు గౌస్‌పాషాను రక్షించే ప్రయత్నం చేసినా.. అప్పటికే మంటలు ఇంటిని చుట్టుముట్టాయి. దాంతో అతడు సజీవ దహనమయ్యాడు. ఈ క్రమంలో మంటలు మరింత వ్యాపించి పక్కనే ఉన్న షేక్ యాకూబ్ అనే వ్యక్తి ఇంటికి సైతం అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లలోని దుస్తులు, సామగ్రితో పాటు విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఘటనపై అన్నపురెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కుమారుడైన శ్రీవారు

- జమలాపురంలో వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం
- నేడు వకుళమాత స్టేడియంలో కల్యాణోత్సవం



జమలాపురంలోని ఆలయంలో ఎదుర్కోలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్స వాల్లో గురువారం ఐదోరోజు శ్రీవారిని పెండ్లి కుమారుడిగా శ్రీదేవి, భూదేవిలను పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. తెల్లవారుజామున సుప్రభా తసేవ, సహస్ర నామార్చన, ప్రాతఃకాల పూజలు, యాగశాలలో అవాహిత దేవత హోమాలు, గోపూజ నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం నుంచి లోకక్షేమం కోసం సర్వశుభాలను ఆహ్వానించేందుకు ఆలయ వేద పండి తులు సప్తాహ్నికంగా దీక్షతో రుగ్వేంహవనం నిర్వహిస్తున్నారు.

వైభవంగా ఎదుర్కోలు

కల్యాణంలో భాగంగా సనాతన ఆలోచనా విధానంలో బ్రాహ్మణ హిందూ వివాహ సాంప్రదాయ పద్ధతిలో వివాహానికి ముందు రోజు నిర్వహించే స్నాతకం (సమావర్తనం) క్రతువుని (మిగతా 6వ పేజీలో)



గాలి దుమారం.. అకాల వర్షం...

- భద్రాద్రి జిల్లా, ఖమ్మం నగరంలో ఆకస్మిక జల్లులు
- కల్లాల్లో తడిసిన మిర్చి, మొక్కజొన్న, ధాన్యం

ఖమ్మం/కొత్తగూడెం/భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో గురువారం సాయంత్రం గాలిదుమారంతో పాటు ఆకస్మిక జల్లులు కురిశాయి. అయితే గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అదేపరిస్థితి ఖమ్మం నగరంలోనూ పునరావృతమైంది. సాయంత్రం నుంచే ఆకాశం మేఘా వృతమై ఉండగా, రాత్రి 12.15 సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మరోవైపు భద్రాద్రి జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడం తో రహదారులన్నీ జలమయమయ్యాయి. కల్లాలో ఆరబోసిన మిర్చి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షంతో (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

రైతుబజార్లను సద్వినియోగం చేసుకోవాలి...

- పంట ఉత్పత్తులను రైతులే అమ్ముకునేలా చూడాలి
- దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దు
- త్వరలోనే మొక్కజొన్న కొనుగోళ్లు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు : 6లో



నాయకన్‌గూడెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

రైతును రాజును చేయడమే లక్ష్యం

- 25.65 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం
- యాసంగిలోనూ సన్న ధాన్యానికి రూ.500 బోనస్
- ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో

భద్రాచలంలో ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఇప్పటికే స్థానికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో 6న భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీసీతారా ముల కల్యాణం, 7న శ్రీరామ మహాపట్టాభిషేకం తిలకించడానికి వచ్చే సామాన్య భక్తులపై జిల్లా అధి కార యంత్రాంగం, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మిథిల స్టేడియంలోని అన్ని సెక్టార్లలో పాగమంచు సౌకర్యాన్ని తొలిసారిగా భక్తులకు అందుబా టులోకి తెస్తున్నారు. ఈ విధంగా ఒక భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాగమంచు విధానం అమలు చేస్తుండటం ఇదే తొలిసారి. అయితే ఇదే సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు చల్లటి తాగునీటిని సైతం అధిక సంఖ్యలో భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని రామ భక్తులు పేర్కొంటున్నారు.



తిలకించి పులకించేనా?

కల్యాణం వేళ సామాన్య భక్తులకు సమస్యలు తలెత్తకుండా చూడాలి

- ఎండల తీవ్రతతో ప్రణాళిక ఎంతో కీలకం
- ఉభయదాతల టికెట్ల కుదింపు పట్ల ఆక్షేపణలు
- నేడు శ్రీరామనవమి ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కల్యాణం వేళ ఎండ వేడిమి నుంచి సేద తీరేందుకు చలువ పందిళ్లలో సైతం జంబో కూలర్లను ఏర్పాటు చేయాలని రామ భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా రామయ్య కల్యాణం అనంతరం తలంబ్రాల పంపిణీ సమయంలో, లడ్డూ ప్రసాద విక్రయాల సమయంలో ఎటువంటి తొక్కిసలాటకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఉభయదాతల టికెట్ల కుదింపుపై ఆక్షేపణలు

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ కల్యాణం తిల కించేందుకు భక్తులకు దేవస్థానం అందుబాటులో ఉంచిన ఉభయదా తల టికెట్లను కుదించడం పట్ల భక్తులనుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతు న్నాయి. వీవీఐపీ సెక్టార్ (సీఎం సెక్టార్) పరిధిలో గతంలో 150మంది కూర్చొనేందుకు అనువుగా ఉండగా ఈసారి దాని పరిధి అద నంగా వంద పెంచడంతో 250కి చేరింది. అలాగే వీఐపీ సెక్టార్ గతంలో 250 ఉండగా ఈసారి అదనంగా 250 పెంచడంతో 500లకు చేరింది. ఇదిలా ఉండగా రూ.7,500 విలువ గల ఉభ యదాతల టికెట్లు వెయ్యి ఉండగా వాటిని 775కు కుదించడం పట్ల భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి దేవస్థా నానికి భారీగా ఆదాయం వచ్చే ఉభయదాతల టికెట్లను కుదిం చడం ఎంతవరకు సమంజసమనే వ్యాఖ్యలు సైతం వినిపిస్తు న్నాయి. దశాబ్ద కాలంగా పలుమార్లు వీవీఐపీ సెక్టార్, వీఐపీ సెక్టార్లను పెంచుతూ పోవడంతో దేవస్థానం ఆదాయానికి భారీగా గండిపడుతోందని దేవస్థానం వర్గాలు సైతం అంతర్గ తంగా వాపోతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలంలో శ్రీరామనవమికి చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించేందుకు శుక్రవారం రాను న్నారు. ఏర్పాట్ల పరిశీలన అనంతరం భద్రాచలం సబ్‌కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా శాఖ అధికారులతో నవమి, పట్టాభిషేక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు.



భద్రాద్రిలో నేడు ధ్వజారోహణం

- భక్తిప్రపత్తులతో గరుడ ధ్వజపట ఆవిష్కరణ
- గోటి తలంబ్రాలను సమర్పించిన రాజమండ్రి భక్తులు

వివరాలు : 6లో

ఈత.. కారాదు గుండెకోత!

- సెలవుల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- నదులు, సముద్రాల వద్ద అశ్రద్ధ చేస్తే అంతే సంగతులు
- విద్యార్థులకు విజ్ఞాన సంబంధమైన అంశాలపై శ్రద్ధ అవసరం
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..

6

మణుగూరు పీకే ఓసీ రికార్డు

- నాలుగోసారి బెస్ట్ పర్‌ఫార్మెన్స్ అవార్డు కైవసం
- తన రికార్డును తానే బ్రేక్ చేసిన గనిగా గుర్తింపు
- ఉద్యోగులను అభినందించిన సింగరేణి జీఎం
- ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాల ప్రదానం

7



అగ్నికీలలు

- పంట పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టిన వ్యక్తులు
- చూస్తుండగానే పార్కులోకి విస్తరించిన మంటలు
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని వెలుగుమట్ల అటవీ పార్కులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పార్కు సమీ పంలోని పొలంలో ఉన్న చెత్తకు గుర్తుతెలియని వారు నిప్పు పెట్టడంతో ఆ మంటలు అటవీపార్కులోకి వ్యాపించాయి. పార్కులో ఉన్న చెట్లకు, గడ్డికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు కొందరు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.వారు వెంటనే సంఘటనాస్థలం వద్దకు చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఒక్క ఫైర్ ఇంజ న్ సరిపోకపోవడంతో మరో ఫైర్ ఇంజన్ తెప్పించారు. సుమారు 20మంది ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. అటవీ శాఖ సిబ్బంది, అధికారులు, పోలీసులు సైతం అక్కడే ఉండి పర్యవేక్షిస్తు న్నారు. ఎండాకాలం కావడం, రాలిన ఆకులు పూర్తిగా ఎండిపోయి ఉండ టంతో మంటలు సులభంగా వ్యాపించినట్టు భావిస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల పార్కుకు ఎంత మేర నష్టం జరిగింది అనేది తెలియరాలేదు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషిచేయాలి

- అభివృద్ధిపై ప్రశ్నించినందుకు ఓ తాగుబోతు నన్ను పక్కన పెట్టాడు..
- మాజీ ఎంపీ సీతారాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశ ఔన్నత్యం కోసం అహర్నిశలు పాటుపడిన మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత అటల్ బిహారి వాజ్‌పేయి జాతిపితగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ అభివర్ణించారు. పదవుల కోసం కాకుండా నీతివంతమైన పాలన కోసం పాటుపడిన వాజ్‌పేయిని జాతిపితగా చెప్పుకోవడంలో తనకు ఎంతో గర్వంగా ఉందని స్పష్టం చేశారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన ఆశయాలను గ్రామ గ్రామాలకు, యువతలో పెంపొందించేందుకు గురువారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం లోని కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో విరాసత్ సమ్మేళనాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుత ప్రధాని మోదీ సారథ్యంలో దేశం విశ్వగురువుగా మారనుందని, అనేక సంస్కరణలు చేపట్టి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేవిధంగా మోదీ పాలన దూసుకుపోతుందని అన్నారు. నాటి కార్యకర్తల అండదండలు పార్టీకి పునాదులని గుర్తు చేసుకుంటూ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీకే. మనోహర్, మధుసూదన్‌రెడ్డి, విద్యాసాగర్, విజయలక్ష్మి, రామచంద్రయ్య, గొడుగు శ్రీధర్, మాలోత్ గాంధీ, లోక్‌నాథం, రాంచంద్రయ్య, గురుమూర్తి, నరేంద్రబాబు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రశ్నించినందుకు ఓ తాగుబోతు నన్ను పక్కన పెట్టాడు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అనేక పోరాటాలు చేశానని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పటి ముఖ్యమంత్రిని సూటిగా పలు అంశాలపై ప్రశ్నించినందుకే ఆ తాగుబోతు తనను పక్కన పెట్టారని మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం, అభివృద్ధి కోసం పాటుపడిన వారిని జాతిపితగా అభివర్ణిస్తారని తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణ పితగా ఉంటారా... అంత అర్హత అందా అంటూ విరాసత్ సమ్మేళనంలో ఛలోక్తులు విసిరారు. అతని పేరు నా నోటితో చెప్పడం ఎందుకని ఇప్పటికే మీకు అర్థమైందని తెలిపారు.

ఇక నది ప్రవాహ వేగం అంచనా?

- పరికరం ఏర్పాటుకు రంగం సిద్ధం
- బ్రిడ్జిపై పరిశీలించిన కేంద్ర జల సంఘం అధికారులు



పరికరం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నది నూతన బ్రిడ్జిపై నది ఉపరితల ప్రవాహ వేగాన్ని విశ్లేషించి కచ్చితమైన సమాచారం అందజేసే పరికరాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధించి సర్వేను కేంద్ర జలసంఘం అధికారులు గురువారం నిర్వహించారు. బ్రిడ్జిపై ఎంట్రోపి ఇమేజ్ ప్రాసెసింగ్ టెస్ట్, నాన్ కాంటాక్ట్ డిశ్చార్జ్ మానిటరింగ్ టెక్నిక్ అనే యంత్రాన్ని బ్రిడ్జిపై సరైన ప్రాంతంలో అమర్చేందుకు స్థలాన్ని నిర్ధారణ చేశారు. సీడబ్ల్యూసీ సబ్ డివిజనల్ ఇంజనీరు కె.పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో ఈ పరిశీలన జరిగింది. ఈ పరికరం ఏర్పాటు వల్ల వర్షాకాలం వరదల సమయంలో రానున్న 24 గంటల్లో ఎగువ నుంచి ఎంత వరద వస్తుందో అంచనా వేయవచ్చు. అలాగే దిగువకు ఎన్ని క్యూసెక్కుల నీరు వెళుతుంది, ప్రతి నిమిషానికి పెరుగుతున్న నీటి వేగాన్ని అంచనా వేసి అప్రమత్తంగా ఉండేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీడబ్ల్యూసీ సబ్ డివిజనల్ ఇంజనీరు కె.పృధ్వీరాజ్ నేతృత్వంలో ఉత్తరాఖండ్‌లోని రూర్కీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీకి చెందిన డా.రవీంద్ర విఠల్ కాలే, ప్రొఫెసర్ ముత్తయ్య పెరుమాల్ పాల్గొన్నారు.

ఇటీవల కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి సమీపంలోని కాల్వలో సరదాగా ఈతకు వెళ్లాడు. కాల్వ నిండుగా ప్రవహించటం, అతనికి ఈత రాకపోవటంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఈ విద్యార్థి ఈతకు బలైపోయాడు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కొడుకు గుండెకోతను మిగిల్చాడు. ఇది కేవలం ఒకరి విషయంలోనే కాదు అనేక కుటుంబాల్లో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. సరదాగా ఈతకు వెళ్లిన అనేకమంది యువకులు నిలువునా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థులు తమ వేసవి సెలవులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ఈత.. కారాదు గుండె కోత

- వేసవి సెలవుల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- నదులు, సముద్రాల వద్ద అశ్రద్ధ చేస్తే అంతే సంగతులు
- విద్యార్థులకు విజ్ఞాన సంబంధమైన అంశాలపై శ్రద్ధ అవసరం
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి వస్తుందంటే విద్యార్థులకు, చిన్నారులకు చెప్పలేనంత ఆనందం. ఇప్పటికే ఇంటర్, పది పరీక్షలు పూర్తయ్యాయి. మరో పదిహేను రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు వస్తాయి. విద్యార్థులు పుస్తకాలను పక్కన పడేసి ఆటలాడటానికి ఎక్కువగా ఇష్టపడతారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలు ఏడాదంతా చదివారు కదా సరదాగా గడపనిద్దాంలే అనుకుంటూ వదిలేస్తారు. అయితే పిల్లల ఆనందం వెంటే కొన్ని విషాదాలు పొంచి ఉంటాయి. వేసవి వేళ విద్యార్థులను సరదా ఈతలు, సైకిల్ రైడింగ్‌లు, మండే ఎండలు ముప్పు తెప్పిస్తాయి. చివరకు తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగిల్చుతాయి. వేసవిలో ఎండ తాపానికి తట్టుకోలేక కొందరు, సరదాగా ఈత నేర్చుకోవటానికి వెళ్లి అనుకోని ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు గుండెకోతను మిగుల్చుతున్నారు. చెరువులు, కాల్వలు, బావుల్లో ఈతకు వెళ్లి ఈత రాక ప్రాణాలు పొగొట్టుకుంటున్నారు.

నదులు, సముద్రాల వద్ద మరణాలు

వేసవిలో ఎండ, సెలవుల కారణంగా కుటుంబసభ్యులు, యువత, ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి నదులు, సముద్రాల వద్దకు సరదాగా వెళ్లటం సహజం. ఎంతో సరదాగా గడిపేందుకు వెళ్లినపుడు స్నానాలు చేయటం, ఈత కొట్టడం సహజం. అయితే కొన్నిసార్లు ఊహించని విధంగా నదుల్లో, సముద్రాల్లో యువత, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవటం చూస్తూనే ఉంటాం. ఆనందంగా గడిపేందుకు వెళ్లి అనేక కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకుంటున్నాయి.

తల్లిదండ్రులు ఇవి పాటించాలి..

- వేసవి నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.
- పిల్లలతో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. దీంతో వారు ఇతర అంశాలపై పెద్దగా దృష్టిపెట్టరు.
- ఖాళీ సమయాల్లో విజ్ఞాన, వినోద సంబంధమైన పుస్తకాలు చదివించాలి
- ఈతకు వెళ్లాలంటే సమీపంలో ఉండే శిక్షణా కేంద్రాల వద్దకు తీసుకెళ్లి ఈత కొట్టించాలి.
- పిల్లలు ఇంటిపనుల్లో సాయం చేసేలా చూడాలి.
- పిల్లలు మారంచేస్తే..నెమ్మదిగా అర్థమయ్యేలా చెప్పాలి.
- ఇంటి నుంచి బయటకు వెళితే తప్పకుండా సమాచారం ఇచ్చి వెళ్లేలా అవగాహన కల్పించాలి.
- తరచుగా జరిగే ప్రమాదాలపైనా అవగాహన కలిగించటం ద్వారా అటువైపునకు వెళ్లకుండా చేయటానికి అవకాశం ఉంటుంది. ఈ దిశగా పిల్లలకు సూచనలు చేయాలి.
- నదులు, సముద్రాల వద్దకు వెళ్లినపుడు అక్కడ ఉండే అంశాలను అవగాహన చేసుకుని రక్షణకుల సూచనలు తప్పకుండా పాటించాలి

ఇతర అంశాలపై దృష్టి సారించవచ్చు..

ప్రసాదరావు, ఎంఈవో, అశ్వారావుపేట



వేసవిలో విద్యార్థులు ఈత కాకుండా ఇతర అంశాలపై దృష్టిసారించవచ్చు. వేసవిలో స్పోకెన్ ఇంగ్లీను నేర్పించవచ్చు. చదరంగం, క్యారెమ్స్ వంటి ఆటల్లో పిల్లలకు తర్ఫీదు ఇవ్వవచ్చు. కంప్యూటర్ కోర్సుల వైపు మళ్లేలా చూసుకోవాలి. వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వేసవి శిబిరాలకు పంపవచ్చు. విద్యార్థులకు నీతికథలు, నైతిక విలువలు వంటి అంశాలను నేర్పించాలి. ఇలా చేయటం ద్వారా పిల్లలు ఈత వైపునకు మళ్లకుండా ఇంట్లోనే ఉండి అనేక అంశాలను నేర్చుకుని వేసవి సెలవులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చు. తల్లిదండ్రులు ఆ దిశగా శ్రద్ధ చూపాలి.

పర్యవేక్షణ ఎంతో అవసరం...

యయాతిరాజు, ఎస్ఐ, అశ్వారావుపేట



వేసవిలో పిల్లలు గంటల తరబడి నీళ్ల చెంతనే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు పనులకు వెళ్లినపుడు చిన్నారులు సమీపంలో ఉన్న చెరువులు, నీటికుంటలు, కాల్వల వద్దకు వెళుతుంటారు. స్నేహితులతో కలిసి ఈత రాకున్నా నీళ్లలోకి దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. పెద్దలు ఎవరూ లేకుండా చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా సూచనలు చేయాలి. పిల్లలకు నీటితో చెలగాటం ఆడితే కలిగే ప్రాణనష్టాలను వివరించటం ద్వారా ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చు.

పెళ్లి కుమారుడైన శ్రీవారు

(5వ పేజీ తరువాయి)

శ్రీవారికి నిర్వహించారు. అనంతరం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని పల్లకిలో ఊరేగించి ఆలయ తూర్పు మండపంలో మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, వేద పండితులు అర్చకుల మంత్రోచ్ఛారణ మధ్య ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు, సిబ్బంది రెండు జట్లుగా విడిపోయి శ్రీవారి గుణగణాలను, అమ్మవార్ల గుణగణాలను కీర్తిని భక్తులకు తెలిపారు. ఒప్పందాలు, చర్చల అనంతరం శ్రీవారు మాకు నచ్చారని అమ్మవార్లు తరుపు వారు, అమ్మవారు మాకు కూడా నచ్చారని శ్రీవారి తరుపున పెద్దలు అంగీకరించడంతో ఎదుర్కోలు కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఈవో కే.జగన్మోహన్‌రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కే.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు మురళీమోహనశర్మ, రాజీవ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

ఖమ్మం నగరానికి చెందిన తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియంలో గల కల్యాణ మండపంలో మొదటిసారిగా శ్రీవారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నారు. టీటీడీ నుంచి ప్రత్యేక కల్యాణ తలంబ్రాలు రావడం ఆనవాయితీగా వస్తోంది. దేవాదాయశాఖ తరుపున ఆలయ ఈవో పట్టువస్త్రాలు సమర్పిస్తారు. సాయంత్రం గ్రామసేవ అనంతరం జమలాపురం పెద్ద చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు.



గాలి దుమారం.. అకాల వర్షం...

(5వ పేజీ తరువాయి)

పలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలంలో గురువారం గాలి దుమారంతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకుఎండ తీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పుచోటుచేసుకుంది. ఈ క్రమంలో గాలి దుమారంతో కూడిన వర్షం పడింది. ఉరుములు, మెరుపులు సైతం స్వల్పంగా వచ్చాయి. ఈ నెల 6న శ్రీసీతారాముల కల్యాణం ఉన్న క్రమంలో ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మిథిల స్టేడియం ప్రాంగనంలో షామియానాలు ఏర్పాటుచేయగా 26 సెక్టార్లలో 250 సైతం బిగించారు. ఈ తరుణంలో వర్షం పడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కళ్యాణానికి మరో రెండు రోజులు గడువు ఉండటంతో అప్పటివరకు పరిస్థితి చక్కబడుతుందని దేవస్థానం వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే రాబోయే రెండు రోజుల్లో వర్షాలు ఉండే అవకాశం ఉందని తెలుస్తుండటంతో కొంత ఆందోళన నెలకొంది.

రైతుల అప్రమత్తం

తల్లాడ (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో గురువారం ఆకాశం మేఘావృతమై జల్లులు పడటంతో రైతులు అప్రమత్తమయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చి, ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టాలు కప్పారు. సాయంత్రం సమయంలో జల్లులు పడ్డాయి. కల్లాల్లో కోసిన మిర్చి ఆరబెట్టిన రైతులు హడావుడిగా టార్పాలిన్ పట్టాలను తెచ్చి కప్పారు. పలు గ్రామాల్లో ధాన్యం నూర్పిడిలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ధాన్యాన్ని ఆరబెట్టారు. దీంతోపాటు నూతనకల్‌లోని కొనుగోలు కేంద్రంలో కూడా ధాన్యాన్ని ఆరబోశారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా రైతులు టార్పాలిన్ పట్టాలను కప్పారు.

రైతుబజార్లను సద్వినియోగం చేసుకోవాలి...

త్వరలోనే మొక్కజొన్న కొనుగోళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించేందుకే రైతుబజార్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రైతు బజార్లలో దళారులకు అవకాశం ఇవ్వొద్దని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌లోని శ్రీరాంనగర్‌లో ఖమ్మం కార్పొరేషన్ నిధులు రూ.58.50 లక్షలతో పునర్నిర్మించిన రైతుబజార్‌ను గురువారం మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూరగాయలు పండించిన రైతులు మాత్రమే నేరుగా రైతుబజార్‌కు తెచ్చి అమ్ముకోవాలని, మార్కెటింగ్‌శాఖ అధికారులు దళారులను అనుమతించవద్దని ఆదేశించారు.

ఖమ్మం నగరంలోని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఈ రైతుబజార్‌ను సద్వినియోగించుకోవాలని సూచించారు. రఘునాథపాలెం మండలంలో గిరిజన రైతులు కష్టపడి కూరగాయలు సాగు చేస్తున్నారని, చిన్న తరహా రైతులే అధికంగా ఉన్నారని, గిరిజన రైతులంతా ఈ రైతు బజార్‌ను సద్వినియోగించుకోవాలని సూచించారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు కూడా రైతులను మాత్రమే రైతు బజార్లలో కూరగాయలు అమ్ముకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని, దళారులకు అమ్ముకునే అవకాశం ఇవ్వొద్దన్నారు. ఖమ్మంలో గతంలోనే తాను ఈ రైతుబజార్‌ను ప్రజల, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందని ఆ తర్వాత దీనిని మూసివేశారని, తర్వాత రైతులు, వినియోగదారుల అవసరాల కోసం వినియోగదారుల కొరకు పునర్నిర్మాణం చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రైతులు పండించిన కూరగాయల లాభాలు పెంచేందుకు, వారికి గిట్టుబాటు ధర వచ్చేందుకు ఈ రైతుబజార్ ప్రారంభించామని తెలిపారు. గాంధీచౌక్ వద్ద రూ.35లక్షలతో మరో రైతుబజార్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ రైతుబజార్‌ను సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్లు పాలెపు విజయ వెంకటరమణ, కమర్తపు మురళి, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, పాలెపు వెంకటరమణ, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రఘునాథపాలెం, వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, రావూరి సైదుబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలకు ట్రాఫిక్ స్టేషన్ నుంచి మార్కెట్ వరకు కాంగ్రెస్ నాయకులు పాలెపు విజయ వెంకటరమణ ఆధ్వర్యంలో గిరిజన సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు.

రైతును రాజును చేయడమే లక్ష్యం

- 25.65లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్పు కావాలనే ప్రజలు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని, దేశ చరిత్రలోనే మొదటిసారిగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నది రేవంత్‌రెడ్డి సర్కారేనని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి గురువారం మండలంలో పర్యటించారు. తొలుత గంగమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం, నాయకన్‌గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రైతును రాజును చేయటమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 25లక్షల 65వేల మంది రైతులకు రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ చేశామన్నారు. యాసంగిలో కూడా సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు.

గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వరి వేస్తే ఉరే అన్నదని, ఇప్పుడు రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పండించిన బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఇప్పటివరకు రైతులకు రూ.5400కోట్లు రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. వానాకాలంలో పండిన పంట గతంలో ఎప్పుడూ పండలేదన్నారు. తెలంగాణలో మొత్తం 153లక్షల టన్నుల ధాన్యం పండిందన్నారు. అన్ని సెంటర్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యమైనా, రైతులు తొందరపడి తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని మంత్రి పొంగులేటి రైతులను కోరారు. రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


నేడు రామాలయంలో ధ్వజారోహణం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముందుగా అగ్ని ప్రతిష్ఠ నిర్వహించి ధ్వజారోహణం అనంతరం సంతానార్థుల కోసం గరుడ ప్రసాదాన్ని వైదిక సిబ్బంది అందజేయనున్నారు. అలాగే బేరీ తాడనం, దేవతాహ్వానం, బలి సమర్పణం నిర్వహించనున్నారు. కాగా గురువారం రాత్రి స్థానిక జీయర్‌మఠంలో గరుడ ధ్వజపట ఆవిష్కరణ నిర్వహించారు. ముందుగా గరుడ ధ్వజపట లేఖనం నిర్వహించి గరుడ ధ్వజ పటాన్ని ఆవిష్కరించారు. అనంతరం గరుడ ధ్వజాదివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవనాద జీయర్‌స్వామి, భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యుడు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన భక్త బృందం గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించారు. సుమారు 300 మంది భక్తులు ప్రత్యేక బస్సుల్లో భద్రాచలం చేరుకుని భద్రాద్రి రామయ్యకు గోటి తలంబ్రాలను సమర్పించారు. భద్రాద్రి రామయ్యకు గోటి తలంబ్రాలను సమర్పించడం తాము పదోసారి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



పాల్గొన్న దేవనాద జీయర్‌స్వామి

దొడ్డి కొమరయ్య జీవితం నేటితరాలకు ఆదర్శం

జయంతి కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అధికారులు

కొత్తగూడెం/ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య చూపిన స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశం హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం తలచుకోగానే మొదటగా గుర్తుకు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అన్నారు. దొడ్డి కొమరయ్య అమరత్వం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీక అని, భూమి భుక్తి, విముక్తి పోరాటం ఉద్యమంగా మారడానికి కొమరయ్య ప్రధాన కారణమని, దొడ్డి కొమరయ్య సాయుధపోరాటంలో చూపిన స్ఫూర్తిని కలెక్టర్ కొనియాడారు. తెలంగాణ ప్రజల కోసం మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి తెలియచేసేందుకు ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి స్ఫూర్తిని మనమంతా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిరా, కలెక్టరేట్ ఏవో రమాదేవి, అన్నిశాఖల జిల్లా అధికారులు, బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు టౌన్, (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ రైతాంగ పోరాటంలో పని చేసిన దొడ్డి కొమరయ్య ఆదర్శనీయుడని సీపీఎం నాయకులు ఎస్‌ఏ. నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌కుమార్ అన్నారు గురువారం ఇల్లెందు కార్యాలయంలో దొడ్డి కొమరయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మన్నెం మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వజ్జ సురేష్, నాగరాజు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మిథిల స్టేడియం నిర్మాణానికి..
ఆద్యుడు ఎన్టీఆర్

» దక్షిణం వైపు చుట్టూ ఆలయాల ఏర్పాటుకు నిధుల మంజూరు


1987లో మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో పాల్గొన్న ఎన్టీఆర్ దంపతులు

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కృషి చేశారు. శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం ఆరు బయట నిర్వహిస్తున్న క్రమంలో భక్తుల ఇబ్బందులను చూసిన ఆయన మిథిలా స్టేడియం నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేశారు.వాస్తవానికి 1960లో భద్రాద్రి రామాలయ పునరుద్దరణకు అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చం ద్రమౌళి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆలయ పునరుద్ధరణ చర్య లు చేపట్టింది. ఈ క్రమంలో 1964లో ఇందుకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. అయితే అవి ఆలయ పునరుద్దరణ కాగా అభివృద్ధికి మాత్రం బీజం వేసిన ఘనత అప్పటి సీఎం నందమూరి తారక రామారావుకే దక్కింది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని ఆనాటి భక్తులు నేటికి గుర్తు చేసుకుంటున్నారు.

60 ఏళ్లకు ఒకసారి నిర్వహించే మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో పాల్గొనే అరుదైన భాగ్యం సైతం ఆయనకే దక్కింది. 1987 ఏప్రిల్ 8న మహాసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించ గా ఇందులో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు దంపతులు పాల్గొన్నారు. ఈ సమయంలో ఆయన మిథిలా స్టేడియం నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆనాడు భారీ ఖర్చుకు సైతం వెనుకడుగువేయకుండా పనులు ప్రారంభించి 1988 మార్చి26న పూర్తి చేశారు. నాటి నుంచి మిథిలా స్టేడియం భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా నేడు మిథిలా స్టేడియంలో సుమారు 15 వేల మంది భక్తులు కళ్యాణాన్ని ఉచితంగా వీక్షించేందుకు అవకాశం లభించింది. ఈ సమయంలో స్టేడియం కింది భాగంలోని గ్యాలరీలకు గోదావరి ఉప నదులైన కిన్నెరసాని, శబరి, ప్రాణహిత, మానేరు, వార్ధా, పెన్‌గంగ తదితర పేర్లను పెట్టారు. ఈ విధంగా నేటి మిథిలా స్టేడియం ఎన్టీఆర్ చలువ వ్లే అందుబాటులోకి వచ్చిందని రామభక్తులు పేర్కొంటున్నారు. కాగా ఇదే సమయంలో శ్రీరామ పవిత్ర గాథా స్పందిత కుడ్యశిల్పాలు సైతం ఆనాడు రూపుదిద్దుకోవాల్సి ఉంది. ఇందులో కొన్ని శిల్పాలు చెక్కగా మిగిలిన పని ప్రభుత్వం మారటంతో ముందుకు సాగలేదు. ఈ క్రమంలో రెండు శిల్పాలుచి త్రకూట మండప ప్రాంగణంలో భక్తులకు అందుబాటులోకి తెచ్చారు..



రూ.30లక్షల నిధుల మంజూరు

రామాలయంలో దక్షిణం వైపు చుట్టు ఆలయాల ఏర్పాటుకు దేవస్థానం అధికారులు ఆ నాడు రూ.30 లక్షల నిధులు ఇవ్వాలని అప్పటి సీఎం ఎన్టీఆర్‌ను ఆలయ సందర్శన సమయం లో కోరగా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే ఆ నిధులను విడుదల చేశారు. దీంతో చుట్టు ఆలయాలను నిర్మించారు. ఇదిలా ఉండగా సంస్కృత పండితులు ఎస్‌టీజీ శ్రీమన్నారాయణాచార్యులు రాసిన విజయశాసనాన్ని చుట్టు ఆలయాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేయడం విశేషం. ఈ విధంగా ఎన్టీఆర్ ఆలయ అభివృద్ధికి ఆద్యుడిగా నిలిచారు.


దక్షిణం వైపు ఉన్న ఆలయాలు

శ్రీరామ నవమికి
రెండు లక్షల లడ్డూ ప్రసాదాలు

» 55 మంది సిబ్బందితో తయారీ ప్రారంభం


సిద్ధంగా ఉన్న లడ్డూలు

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచం ద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 6న నిర్వహించనున్న సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చే భక్తులకు రెండు లక్షల లడ్డూలను దేవస్థానం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో తానీషా కళ్యాణ మండపంలో గురువారం లడ్డూ తయారీ పనులు ప్రారంభం అయ్యాయి. మొత్తం 55 మంది సిబ్బంది లడ్డూ తయారీ, తరలింపులో పాల్గొంటున్నారు. రోజుకి 50వేల లడ్డూలను తయారుచేసి నవమికి రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా పదివేల పెద్ద లడ్డూలను సైతం సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రామాలయం ప్రాంగణంలోని ప్రసాదాల తయారీ విభాగంలో రోజుకి 15 వేల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. నిత్యం వచ్చే భక్తుల కోసం లడ్డూలను విక్రయించనున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక్కడ 15 మంది లడ్డూ తయారీలో పనిచేస్తున్నారు.

రామయ్య పట్టాభిషేకంలో పాల్గొనే సిబ్బంది ఖరారు

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి కల్యాణం ఈ నెల 6న నిర్వహించనుండగా, 7న నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకంలో పాల్గొనే వైదిక పరిపాలన సిబ్బంది జాబితాను దేవస్థానం అధికారులు అధికారికంగా ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వైదిక సిబ్బందిలో 17 మంది పాల్గొననున్నారు. వేద పండితుల్లో నలుగురు, పరిపాలన విభాగంలో 11 మంది, భజంత్రీల్లో ఆరుగురు, హరిదాసుల్లో ముగ్గురు పాల్గొననున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన జాబితాను దేవస్థానం అధికారులు భద్రాచలం ఏఎస్‌పీతో పాటు ఇతర ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం

రామయ్యను దర్శించుకున్న కేరళ ఐఏఎస్ అధికారి

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సాయికృష్ణభద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి సాయికృష్ణ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబ, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న కేరళ ఐఏఎస్ అధికారి సాయికృష్ణ

రామాలయంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది మాక్ డ్రిల్

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రామాలయ ప్రాంగణంలో భద్రాచలం అగ్నిమాపక శాఖ సిబ్బంది గురువారం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఊహించని రీతిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఏ విధంగా రక్షణ చర్యలు చేపట్టాలో సిబ్బంది ఎస్‌పీఎఫ్, హోంగార్డు, ఇతర సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ అధికారి శ్రీనివాస్, ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుళ్లు కుంజా శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నవమి కల్యాణ స్వాగత గీతానికి ఆదరణ

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 6న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని రూపొందించిన స్వాగత గీతానికి విశేష ఆదరణ లభిస్తోంది. తొలిసారిగా దేవస్థానం ఆధ్వర్యంలో రామయ్య కల్యాణంకు రూపొందించిన స్వాగత గీతం అందరిని ఆకట్టుకుంటోంది. కల్యాణానికి రావాల్సిందిగా భక్తజనానికి స్వాగతం పలుకుతూ ఆనాటి జనకపురి నేటి భద్రగిరిగా మారిందని ఆదర్శమూర్తుల కల్యాణానికి స్వాగతమని, జన్మదినం నాడే జగదభిరాముని కల్యాణం నిర్వహించడం భద్రాద్రి ప్రత్యేకత అని చాటుతూ ఈ స్వాగత గీతం సాగింది. అలాగే పాంచరాత్ర ఆగమశాస్త్రం అనుసారం అభిజిత్‌లగ్నంలో సీతారాముల కల్యాణం సాగే సంప్రదాయంను భక్తరామదాసే స్వయంగా జరిపిన వైనాన్ని అందులో ప్రస్తావించారు. అలాగే మూడు పతకాల మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలు, ఎర్రటి అక్షతలు, అదేవిధంగా ఆణిముత్యాలు, మంగళాలను ప్రసాదిస్తాయని అలాగే ఈ కల్యాణాన్ని తిలకించిన వారికి అశ్వమేధ యాగలఫలం లభిస్తుందని, అటువంటి మంగళకరమైన శ్రీరామనవమి కల్యాణంకు రావాల్సిందిగా భక్తకోటికి స్వాగతం పలుకుతూ సాగిన ఈ గీతం రామ భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ గీతాన్ని భద్రాద్రి దేవస్థానం రామాయణపారాయణదారు, కవి రచయిత ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిగా ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు నేమాని పార్థసారథి సంగీతం సమకూర్చి గానం చేశారు. కాగా ఈ గీతాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇటీవల ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

ఆ 'ఐదు గోత్రాల'కే దక్కిన అరుదైన భాగ్యం

» రామయ్యను పూజించి తరిస్తున్న భద్రాద్రి అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎవరికి దక్కని అరుదైన భాగ్యం ఆ ఐదు కుటుంబాలకే దక్కింది. గోదావరి నదీ తీరాన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించిన తరువాత ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్తరామదాసు తమిళనాడు రాష్ట్రంలోని శ్రీ రంగంలో పాంచరాత్రగమంలో నిష్ణాతులైన ఐదు గోత్రాల వారిని తీసుకువచ్చారు. కౌశికస, హరితస, ఆత్రేయస, భరద్వాజస, కౌండిన్యస గోత్రాల వారిని భద్రాచలం తీసుకురాగా ఇందులో కౌండిన్యస గోత్రానికి చెందిన తూరుగోటి వంశస్థులు ఎవరు లేరు. కాగా ఇటీవల గొట్టిపుళ్ల వంశానికి చెందిన వారు సైతం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ వంశానికి చెందిన వారు సైతం స్వామి వారి సేవ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. మిగిలిన నాలుగు గోత్రాలకు చెందిన వారు గత కొన్ని శతాబ్దాలుగా భద్రాద్రి రామయ్యకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా అమరవాది, కోటి, పొడిచేటి ఇంటి పేర్లకు చెందిన 16 కుటుంబాల వారు ఆలయంలో అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా వీరందరు పరస్పరం దూరపు బంధువులే కావడం విశేషం. కాగా వీరికి మాత్రమే ఆలయంలోని మూలవరులకు అర్చన చేసే సంప్రదాయం అనాదిగా కొనసాగుతోంది. అలాగే శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం నిర్వహించే భాగ్యం ప్రధానంగా ఈ కుటుంబాల వారే నిర్వహిస్తుంటారు.



పది నుంచి కుర్నవల్లిలో ఐదు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

తల్లాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలపతి స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో ఈనెల 10,11,12 తేదీల్లో ఐదు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అయిలూరి శేషిరెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక


నియామకపత్రాన్ని అందజేస్తున్న డీడీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కమిటీని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుల సంఘాల నాయకులు, సామాజికవ్యక్తుల సమక్షంలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. కన్వీనర్‌గా జమళ్లముడి దాస్‌మహారాజ్, అధ్యక్షుడిగా కొర్లపాటి చిరంజీవి, గౌరవ అధ్యక్షులుగా మసు జాకబ్‌ప్రసాద్, ఇటికల లత, కో కన్వీనర్‌లుగా మాచర్ల ఏసోబు, కూరపాటి సునీల్, పేరం మల్లయ్య, తూరుగంటి రాముమాదిగ, ఇసంపల్లి వంశీ, కోట్టి నాగేంద్రబాబు, కాశిమల్ల వెంకటేశ్వర్లు, పోతురాజు కమలాకర్, కుక్కల రాములు, బుట్టి నాగేశ్వరరావు నాగమణిలతో పాటుగా కమిటీ సభ్యులను నియామకం చేశారు.

డబ్బు తీసుకెళ్లారని ఫిర్యాదు

కొణిజర్ల,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): తన పెద్దకొడుకు కుమారులు ఇంటికి వచ్చి తనను నెట్టివేసి పొలం అమ్మగా తమ వద్ద ఉన్న డబ్బులను తీసుకెళ్లారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం దేవళ్ల గురవమ్మ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో ఉన్న వివరాలు ప్రకారం పొలం అమ్మగా వచ్చిన డబ్బులు రూ.4.50 లక్షలు తమ వద్ద ఉంచుకోగా మధ్యాహ్నం సమయంలో పెద్దకొడుకు కుమారులు నవీన్, శ్రీకాంత్ ఇద్దరు వచ్చి దౌర్జన్యంతో తనను నెట్టివేసి తమ వద్ద ఉన్న డబ్బులను తీసుకెళ్లారని గురవమ్మ ఫిర్యాదు చేసింది. విచారిస్తున్నామని ఎస్ఐ సూరజ్ తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

తిరుమలాయపాలెం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన కామళ్ల వీరయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మానసిక, శారీరక దివ్యాంగురాలిని పెండ్లి చేసుకుంటానని నమ్మబలికి అత్యాచారం చేయడంతో ఆమె గర్భం దాల్చింది. దీంతో అతన్ని నిలదీయగా ఈ విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈమేరకు ఎస్ఐ జగదీష్ నిందితుడిపై కేసు నమోదుచేసి గురువారం కోర్టుకు రిమాండ్ చేశారు.

మణుగూరు పీకే ఓపెన్ కాస్ట్ గని రికార్డు

» నాలుగోసారి బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కైవసం
» ఉద్యోగులను అభినందించిన జీఎం
» ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు

మణుగూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే కాకుండా అన్ని రంగాల్లో మేటిగా నిలుస్తోంది సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకే(ప్రకాశం ఖని) ఓసీ-2 గని. 2020-21లో యాంత్రిక సామర్థ్యాన్ని నియోగించడం సింగరేణి వ్యాప్తంగా బెస్ట్ పర్‌ఫార్మెన్స్ అవార్డును కైవసం చేసుకుని రికార్డును సృష్టించింది. ఈ ఒక్క ఏడాదే కాదు వరుసనగా 2021-22, 2022-23, 2023-24లో కూడా ఇదే పరంపరను సింగరేణి సం స్థలో చాటుతూ తన కీర్తిని నలుదిశలా చాటింది. మూడు సార్లు ఓ గనికి బెస్ట్ పర్‌ఫార్మెన్స్ అవార్డు కైవసం కావడం చరిత్ర కాగా, ఈ ఏడాది కూడా తిరగ రాస్తూ మరో రికార్డు నెలకొల్పింది. 2024-25 సంవత్సరానికి మరో మారు అంటే నాలుగో సారి కూడా ఈ అవార్డును కంపెనీ వ్యాప్తంగా కైవసం చేసుకోవడం తన రికార్డును తానే బ్రేక్ చేసిన గనిగా సింగరేణి చరిత్రలో గుర్తింపు సాధించింది.

ఈ నేపథ్యంలో గురువారం న్యూ సైట్ గని ఆవరణలో ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి గౌడ్ సారథ్యంలో కార్మికులకు ఉద్యోగులు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో పాటు స్వీట్లు, బహుమతులను జీఎం అందజేశారు. ప్రతి సెక్షన్‌లో ఉత్తమ ప్రతిభను కనర్చిన ఉద్యోగులు వీటిని అందుకున్నారు. వీరితో పాటు ఏడాదిలో ఓవరాల్ బెస్ట్‌పెర్ఫామెన్స్ ఇచ్చిన ఉద్యోగులకు బహుమతులతో పాటు జీఎం ప్రశంసలు పొందిన వారిలో ఉన్నారు. అలాగే సంస్థ ప్రయోజనం కోసం ఉత్తమ సలహాలను ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులకు స్పెషల్ గిఫ్టులను జీఎం అందజేశారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ 'కోల్ ఇండియాతో పోల్చుకుంటే మన బొగ్గు అమ్మకం ధర ఎక్కువగా ఉంది.. మన వినియోగ దారులను మనం కాపాడుకోవాలి.. బొగ్గు ధర తగ్గించాల్సిన పరిస్థితికి చేరుకున్నాం... ఉత్పత్తి వ్యయం తగ్గాలి... అంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..' అని సీఎండీ బలరాం సూచించారని, ఆయన ఇచ్చిన స్ఫూర్తితో లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ గత సంవత్సరం మణుగూరులో ఎక్కువగా వర్షాలు, ఎక్విప్‌మెంట్ సమస్యలతో కొంత ఉత్పత్తిలో వెనుకబడినప్పటికీ, చివరి మూడు నెలల్లో వందశాతం ఉత్పత్తిని సాధించడం జరిగిందన్నారు. ఈ ఏడాది 115 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని ఇచ్చారని దాన్ని కూడా సాధిస్తామని తెలిపారు. ఒక్క రోజులో 1,04,000 క్యూబిక్ మీటర్ల ఓ బీని తీయడమే అద్భుతం అనుకుంటే, మరోసారి 1,05,805 ఓబీని తీసి సరికొత్త రికార్డును సృష్టించిందన్నారు.

ఈకార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, కృష్ణమూర్తి, సివిల్ ఏజీఎం డి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరభద్రుడు, గని మేనేజన్ సురేస్ కుమార్, ఏరియా సేఫ్టీ అధికారి వెంకట రామారావు, ఎస్ఓటూ జీఎం డి.శ్యాంసుందర్, ఫైనాన్స్ అధికారి ఎం.అనురాధ, పలు శాఖల అధికారులు పీకే ఓసీ ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం రాంచందర్

రైతులు మామిడి పంటను సాగు చేయాలి: కలెక్టర్


మామిడి తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కామేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పండ్లలో లాభదాయక మామిడి పంటను అధికంగా సాగు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోవింద్రాల ఆదర్శ రైతు బానోత్ లక్ష్మణ్ మామిడి తోటను పరిశీలించారు. లక్ష్మన్‌తో గంట పాటు ముచ్చటించారు. గతంలో ఏ పంటలు సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, అంతర్ పంటల సాగు ఎమైనా ఉందా, మామిడి ఏడాది ఎంత దిగుబడి వస్తుంది. నీటి వనరులు ఎలా ఉన్నాయి. వంటి వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. మామిడి సాగు విధానం పంట దిగుబడికి తీసుకుంటున్న చర్యలు మార్కెటింగ్ విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్బైడ్ రహిత మామిడి పండ్ల విక్రయం ద్వారా అధిక ఆదాయం పొందుతున్న వివరాలతోపాటు కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. బానోత్ లక్ష్మణ్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువ రైతులు లాభదాయక పంటలపై ఆసక్తి చూపాలన్నారు. అంతరకుముందు మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా కొత్తలింగాలలో ఉండేటి అమృత సుధాకర్ దంపతలకు జన్మించిన పాపతో పాటు అత్తమామలను శాలువాతో సత్కరించారు కొత్తలింగాల అంగన్‌వాడీ కేంద్రంలో దాతలు. డా జానకిరామయ్య సరోజిని మనువడు అభి ఏర్పాటు చేసిన పవర్ ఇన్వెర్టర్‌ను ప్రారంభించారు. ఈ పరిశీనలలో డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మధుసూధన్, ఏడీఏ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, ఏవో తారాదేవి, ఉద్యాన అధికారి వేణు, శ్రావణి సూపర్‌వైజర్ లలితమ్మ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తోటమాలికి పాముకాటు

ఆస్పత్రిలో పరామర్శించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కలెక్టరేట్‌లో తోటమాలిగా పనిచేస్తున్న ఓ మహిళను గురువారం పాము కాటేసింది. దీంతో కలెక్టరేట్‌లో అలజడి చెలరేగింది. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాధపాలెం మండలం వీవీపాలేనికి చెందిన పి.ఆదిలక్ష్మీ కలెక్టరేట్‌లో ఓట్‌సోర్సింగ్ విభాగంలో తోటమాలిగా పనిచేస్తోంది. యథావిధిగా ఆమె గురువారం విధుల్లోకి వచ్చింది. కలెక్టరేట్ ఎదుట గ్రీనరీలో దర్నాచౌక్ మెయిన్ ద్వారం ప్రాంతంలో మొక్కలు కట్ చేసిన చెత్త అంతా అక్కడ పేరుకుపోయింది. దాన్ని తొలగిస్తుండగా చెత్తలో ఉన్న పెద్ద తాచుపాము ఆమెను కాటేసింది. నలుగురు మహిళలు ఆమెతో పనిచేస్తుండగా దీంతో పెద్దగా అరుస్తూ ఆమె కిందపడిపోయింది. హార్టీకల్చర్ ఆఫీసర్ కారులో సహచరులు హుటాహుటీన ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఐసీయూలో ఆమెకు చికిత్సలు అందిస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మధ్యాహ్నం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మిని పరామర్శించారు. ఆమె పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ప్రస్తుతం ఆదిలక్ష్మీ పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టరేట్‌లో పాము కరిచిన సంఘటనతో ఒక్కసారిగా సిబ్బంది ఉలిక్కిపడ్డారు.

ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురు రామభక్తులకు గాయాలు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురికి తీవ్రంగా గాయాలైన సంఘటన మండలంలో గురువారం ఉదయం జరిగింది. ఆంధ్రాలోని చాగల్లు, జంగారెడ్డిగూడెం, నిడదవోలు ఇలా దాదాపు 20 గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాదయాత్రగా భద్రాచలం వెళుతున్నారు. అలసిపోయిన కొందరు భక్తులు ట్రాక్టర్‌పై ఎక్కారు. మండలంలోని నందిపాడు, గాడ్రాల స్టేజీ మధ్యలో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో చాగల్లుకు చెందిన కూచిపుడి మంజు అనే యువతికి ఎడమకాలు పాదం పూర్తిగా తెగి పడిపోయింది. కలపర్తి గంగాభవాని అనే వృద్ధురాలికి ఎడమ కాలు విరిగింది. కొండపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తికి కుడిచేతికి తీవ్రంగా గాయాలు కావటంతో ముగ్గురికి పలుచోట్ల గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స అనంతరం మంజులను విజయవాడకుకు, గంగాభవానిని రాజమండ్రికి తరలించారు. ఎస్ఐ యయాతిరాజు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మంచికంటినగర్‌కు చెందిన బందువ రాజు(25) స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో అకారణంగా భార్య నాగలక్ష్మితో గొడవలు పడుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం కుటుంబ సభ్యులు గమనించి చూడగా అప్పటికే అతను మృతిచెంది ఉన్నాడు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

ఇల్లెందు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీలో నివాసముండే హోంగార్డు బుసుగుల లక్ష్మీనారాయణ (53) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. గుండాల పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మృతుడు ఇల్లెందు పట్టణంలో నివాసముంటున్నాడు. గురువారం ఉదయం నివాస గృహంలోనే గుండెపోటుకు గురి కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

యువత సామాజిక బాధ్యతతో ఎదగాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): యువత విద్య, ఉద్యోగం, ఉపాధితో పాటుగా సామాజిక బాధ్యతతో ఎదగాలని, ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు విప్లవాత్మకంగా అమలు చేస్తున్న ప్లాస్టిక్ రహితం, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో యువత కీలకంగా పనిచేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సూచించారు. గురువారం ఎస్సీ బాలుర కాలేజీ వసతిగృహంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 అవగాహన సదస్సు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వాడకంతో పర్యావరణంలో వచ్చిన మార్పులను వివరించారు.



'జై సంవిధాన్' విజయవంతం చేయండి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ చరిత్రను మార్చే కుట్రలు చేస్తోందని, దేశానికి ఎనలేని సేవలు చేసి ప్రాణత్యాగాలు చేసిన నాయకుల చరిత్రను కనుమరుగు చేసే రాజకీయాలు చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ తల పెట్టిన జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం నగరంలోని త్రీటౌన్ కాంగ్రెస్ నాయకులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. జై సంవిధాన్ కార్యక్రమం విజయవంతంపై డివిజన్‌ల నాయకులతో సమీక్షించారు. బీజేపీ లోపాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. దేశానికి భవిష్యత్ తరాలకు మంచి జరగాలని కాంగ్రెస్ ఎప్పుడు కోరుకుంటుందని, అందుకే జైసంవిధాన్ యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ, కన్నెం వైష్ణవి, కమర్తపు మురళీ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎన్) ఆధ్వర్యంలో ముద్రించిన విశ్వావసు నామ సంవత్సర పంచాగాన్ని గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీడీఎన్ సంఘం నాయకులు మునగలేటి రమేష్ శర్మ, ప్రసాద్ శర్మ, భార్గవా చార్యులు, శ్రీధర్‌శర్మ, ఆమంచి సురేష్ శర్మ, తదిరులు పాల్గొన్నారు.

ముందస్తు చెల్లింపులపై 5శాతం రాయితీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ ట్యాక్స్ సక్రమ చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పురపాలకాల్లో ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. ఏడాది లేదా ఆరు నెలల ప్రాపర్టీ ట్యాక్స్‌ను ముందస్తుగా చెల్లింపులు చేసిన వారికి 5శాతం వరకు రాయితీ అవకాశం ఎర్లీబర్డ్ పథకం ద్వారా అమలు జరుగుతుంది. మార్చి 31 వరకు గతేడాది ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల కోసం 25శాతం రాయితీని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ముందస్తు ఆదాయ వసూళ్లపై దృష్టి సారించింది. ఎర్లీబర్డ్ పథకంలో 5శాతం రాయితీ పొందాలంటే ఆయా ప్రాపర్టీలకు పాత బకాయిలు ఉండకూడదు. ఆలాంటి భవనాలు ముందుగా ఆదాయ చెల్లింపులకు అర్హత పొంది ఉంటాయి. ఖమ్మం నగరంలో ఎర్లీ బర్డ్ పథకానికి 51,770 భవనాలు అర్హత పొందాయి. వాటి ద్వారా రూ.24.73 కోట్ల వరకు ముందస్తు ఆదాయ వసూళ్లకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు.

కేఎంసీలో వార్డు ఆఫీసర్ల విభజన

- ప్రతి రెండు డివిజన్లకు ఒక వార్డు ఆఫీసర్ నియామకం
- కార్యాలయంలో విభాగాలకు 12 మంది కేటాయింపు
- వార్డు ఆఫీసర్లకు వృత్తి పరమైన శిక్షణ



కార్పొరేషన్ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో గ్రూప్ పరీక్షల ద్వారా ఉద్యోగంలో చేరిన వార్డు ఆఫీసర్లకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య డివిజన్లు కేటాయించారు. ప్రతి రెండు డివిజన్‌లకు ఒక వార్డు ఆఫీసర్‌ను కేటాయించారు. ఖమ్మం నగరంలో ఇప్పటికే నార్త్ జోన్ కార్యాలయం పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభమైంది. రెండు రోజుల్లో బల్లేపల్లిలో నార్త్ జోన్ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే వార్డు ఆఫీసర్లను నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్, సెంట్రల్ జోనల్ కార్యాలయాల వారీగా విభజన ప్రక్రియను పూర్తి చేశారు. కేఎంసీ కార్యాలయంలో గురు, శుక్ర వారాల్లో నూతన వార్డు ఆఫీసర్లకు వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఎకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాలపై ఆయా విభాగాల పర్యవేక్షక అధికారులు శిక్షణ ఇచ్చారు. అలాగే ఎన్నో ఏళ్లుగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో తిష్ట వేసి పరిపాలనకు తల నొప్పిగా మారిన కొంతమంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బయటకు పంపేందుకు కసరత్తు పూర్తి చేశారు. ఈ మేరకు 12 మంది వార్డు ఆఫీసర్లను ఖమ్మం నగర పాలక సంస్థలోని విభాగాలకు కేటాయించారు. కీలకమైన విభాగాలకు వార్డు ఆఫీసర్లను నియామకం చేశారు. కాగా కేఎంసీ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు గ్రౌండ్ ఫ్లోర్‌లో విభాగాలు కేటాయించగా వారిని పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ అధికారి మాత్రం రెండో ఫ్లోర్‌లో ఉండటంతో రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒకే విభాగం ఒకే ప్రాంతం(ఫ్లోర్)లో ఉంటే పరిపాలనకు అనుకూలంగా ఉంటుందని కేఎంసీ కార్యాలయంలో చర్చ జరుగుతోంది.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న నారాయణరావు

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 6న జరిగే కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురువారం ఆలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆలయ ఈవో వీవీ నరసింహారావు, అర్చకుడు నారాయణ. కృష్ణ కిషోర్, కార్పొరేటర్ చావా మాధురినారాయణరావు, ఉత్సవ కమిటి సభ్యులు చావా నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే రెండో అతిపెద్ద పర్ణశాల ఆలయంగా ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఆలయంలో గతంలో ఎన్నడులేని విధంగా ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా వసంత నవరాత్రి సహిత కల్యాణ మహోత్సవం జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. సుదర్శన హోమం నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని, చలువ పందిళ్లు, మంచినీళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. 6న జరిగే కల్యాణానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయటం జరిగిందని అన్నారు. 7న స్వామి వారి పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి కల్యాణం, పట్టాభిషేకంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు ఆధ్వర్యంలో పసుపు దంపుల్ల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విలేకర్ల సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొత్త రవికుమార్, బసవయ్య, కోమలి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూపీహెచ్ కాలనీ స్వయంభు అభయ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం స్వామివారికి పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. 18 రకాల పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకులు నరగిరినాథుని రామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో పుష్పాభిషేకం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో మహా అన్నదానం నిర్వహించారు. సుమారు ఆరు వేల మందికి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి. కొమరయ్య, కార్యదర్శి పురం. తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్, డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, కార్పొరేటర్‌లు నాగండ్ల కోటేశ్వరరావు, వలరాజు, ఆలయ కమిటి సభ్యులు అల్లిక అంజయ్య, కొండల్‌రావు, వెంకన్న, మణికంఠ, సుబ్బాచారి, వెంకటేశ్వర్లు, వీరన్న, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందివ్వడమే లక్ష్యం: పొంగులేటి


మద్దులపల్లిలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మెరుగైన విద్యుత్ అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులోని తరుణిహట్ ప్రాంతంలో రూ.3.50 కోట్ల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి పొంగులేటి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా మున్సిపాలిటి పరిధిలోని మద్దులపల్లి, వరంగల్ క్రాస్ రోడ్డు, రూరల్ మండలంలోని గూడురుపాడు, కాచిరాజుగూడెం, ఎంవీ పాలెం, కస్నాతండా గ్రామాల్లో గురువారం మంత్రి పొంగులేటి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా మెరుగైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం సబ్‌స్టేషన్లను అభివృద్ధి చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల గుర్రంలా పరుగులు పెడుతోందన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేకున్నా ప్రజల అవసరాలను తల తాకట్టు పెట్టైనా తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆర్‌డీవో నరసింహరావు, తహశీల్దార్ రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాం అందివ్వాలి: అడిషనల్ కలెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం నేలకొండపల్లి వచ్చిన అడిషనల్ కలెక్టర్ మండల వనరుల కేంద్రాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఉన్న విద్యార్థుల యూనిఫాం బట్టను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి దర్జీ దగ్గర యూనిఫాం కుట్టించాలని, విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. రాజీవ్ యువ వికాస్‌కు స్పందన ఎలా ఉందంటూ ఎంపీడీఓను అడిగారు. ఎంపీడీవో మర్రి యర్రయ్య, ఎంపీవో చిప్పా శివ అడిషనల్ కలెక్టర్ వెంట ఉన్నారు.

కేఎంసీకి తీరిన నీటి కష్టాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేఎంసీ నీటి కష్టాలు తొలగాయి. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కేఎంసీ నీటి కష్టాలు కథనంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. ఈఈ కృష్ణలాల్‌తో మాట్లాడి గురువారం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. మూడు ఫ్లోర్లకు నీటి సరఫరా జరగడంతో ఉద్యోగుల తిప్పలు తీరాయి.

రామదాసుకు గోటి తలంబ్రాలు

నేలకొండపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తరామదాసు జన్మస్థలం నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో నిర్వహించనున్న నవమి వేడుకలకు గోటి తలంబ్రాలను తయారుచేస్తున్నారు. గురువారం భక్తరామదాసు ధ్యాన మందిరంలో గురువారం పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు గోటి తలంబ్రాలు వలవటం ప్రారంభించారు. గోటి తలంబ్రాలు వలిచిన అనంతరం పసుపు కొట్టి తలంబ్రాలను కలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

13న వైరాలో టీయూసీఐ జిల్లా మహాసభ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అసంఘటిత, సంఘటిత రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అనేక పోరాటాలు చేసి కార్మికుల హక్కుల్ని కాపాడిన టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) జిల్లా మహాసభలు ఈనెల 13న వైరాలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి రామయ్య పేర్కొన్నారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని

జిల్లా ఆస్పత్రికి ఎస్‌ఆర్‌ల కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రికి 29 మంది ఎస్‌ఆర్‌లను కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. గాంధీ, ఉస్మానియా, ప్రతిమ, మమత మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన మెడికల్ విద్యార్థులకు సీనియర్ రెసిడెన్సీలుగా కేటాయించారు. వీరిలో గురువారం నాటికి 17 మంది విధుల్లో చేశారు. మిగిలిన విద్యార్థులు శుక్రవారం నాటికి చేరనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన మహిళ అరెస్ట్

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగులను మాయమాటలతో నమ్మించి మోసంచేసిన ఆదిలక్ష్మి అనే మహిళను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాపర్తినగర్‌లోని వివేకానంద కాలనీకి చెందిన గుడిబండ్ల ఆదిలక్ష్మి మామిళ్ళగూడెంకు చెందిన పోట్ల హరీష్‌తో పాటు పలువురు వద్ద సుమారు 16లక్షల రూపాయలు ఉద్యోగాల పేరిట వసూలుచేసింది. దీంతో హరీష్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి సదరు మహిళను రిమాండ్‌కు తరలించినట్లు, ఆదిలక్ష్మిపై గతంలో కూడా పోలీస్‌స్టేషన్లో పలు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

ఫ్లెక్సీలు చించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలగూడెంలో నిర్మాణంలో ఉన్న టీడీపీ కార్యాలయంకు కట్టిన ఫ్లెక్లీలను, పార్టీ జెండాలను చించటం దారుణమని, కార్యాలయంపై దాడికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్ డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన కొంత మంది గత 10 సంవత్సరాలుగా టీడీపీ కార్యాలయాన్ని కబ్జా చేయటానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికార పార్టీ అండతో టీడీపీ కార్యకర్తలను కార్యాలయంలోకి అడుగు పెట్టకుండా, అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేసారన్నారు. టీడీపీ కార్యకర్తలు చందాలు వేసుకుని, ఇతరుల సహకారంతో టీడీపీ కార్యాలయం నిర్మాణం ప్రారంభించారని, అనివార్య కారణాల వలన కార్యాలయ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. టీడీపీ కార్యాలయాన్ని కబ్జా చేయటానికి, గతంలో పార్టీలో ఉండి బీఆర్ఎస్‌లోకి వెళ్ళిన నాయకుడు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. అదేగనుక నిజమైతే సదరు నాయకునిపైనా, అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శిపైనా చర్యలు తీసుకోవాలని కరుణాకర్ డిమాండ్ చేసారు. గత నెల 29న పార్టీ ఆవిర్భావం రోజున పోలీస్‌వారి అనుమతితో పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశామన్నారు.

విద్యార్థులపై లాఠీచార్జి సిగ్గుచేటు: బీజేపీ



నిరసన ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు తమ భూములు తమకు కావాలని ఆందోళన చేస్తుంటే వారిపై లాఠీచార్జి చేయడం దారుణమని, ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే గద్దెదింపుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. నగరంలోని జడ్పీసెంటర్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో యువమోర్చా నాయకులపై హైదరాబాదులో జరిగిన దాడికి నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, సెంట్రల్ యూనివర్శిటీ భూములు ఒక్క కుంట అమ్మినా విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు క్షమాపణ చెప్పి వన్యప్రాణులకు అవసరమైన సెంట్రల్ యూనివర్శిటీ భూములను అమ్మే విషయం రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ పరిసర ప్రాంతం వన్యప్రాణులకు ఆశ్రయం ఇస్తుందని, ఈభూమిని అభివృద్ధి చేయాలంటే అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం కేంద్ర అనుమతులు కూడా అవసరమన్నారు కానీ ప్రభుత్వం ఎలాంటి అనుమతి లేకుండానే ఈప్రదేశంను వేలం వేయాలని చూస్తుందన్నారు. భూముల రక్షణ కోసం బీజేపీ నిరసన మరింత ఉధృతం చేయనుందని ఈ భూములను వేలం వేయాలని చూస్తే బీజేపీ నిలవరించకుండా ఉండదన్నారు. ఈ నిరసన చేస్తుండగా పోలీసులు వారిని అడ్డుకుని వారిని అక్కడినుండి పంపించారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గొంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శీలం పాపారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, ఈదుల వీరభద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్, కార్తీక్, కుమిలి శ్రీనివాస్, దొడ్డ అరుణ, సతీష్, రమేష్, పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో ల్యాబ్‌లు ప్రారంభం


మైక్రోబయాలజీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెడికల్ కళాశాలలో మెడికో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ, రెండో సంవత్సరం విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారి కోసం మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ ల్యాబ్‌ను ప్రారంభించారు. దీనికి అనుసంధానంగా లెక్చర్ రూంతో పాటు ప్రయోగాత్మకంగా విద్యార్థుల బోధన కోసం ఈ మూడు ల్యాబులు అవసరం ఉంటుందని తెలిపారు. అంతే కాదు మూడు, నాల్గో ఏడాది విద్యార్థులకు అవసరమయ్యే విధంగా వీటిని రూపొందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి సరిత, ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సమత, ప్రీతి, ట్యూటర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ సుజనాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సన్నబియ్యం పథకానికి..
కేంద్రం డబ్బులు చెల్లిస్తుంది

బీజేపీ జిల్లా నాయకుడు రుద్రప్రదీప్

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు అందించే సన్నబియ్యం పథకంలో భాగంగా ఒక కేజీకి రూ.40లను కేంద్రం అందిస్తుందని కేవలం రూ.10మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు రుద్రప్రదీప్ అన్నారు. నగరంలోని 24వ డివిజన్‌లో గురువారం ఓ రేషన్‌షాపును సందర్శించి స్థానికులకు రేషన్‌బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యానికి ఎక్కువ డబ్బులుచెల్లిస్తున్న విషయం ప్రజలకు తెలియకుండా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్ర ప్రభుత్వానిది లాగా వ్యవహరిస్తుందన్నారు. అదేవిధంగా రేషన్‌షాపుల వద్ద ప్రధాని మోదీ ఫొటో పెట్టకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం అందిస్తున్న సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం సోకులు పోతోందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయాలు రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరభద్రప్రసాద్, మంద సరస్వతి, వెంకట్, నరేష్, దీకొండ శ్యామ్, శంకర్, రుద్రప్రతాప్, శ్రీనివాసరావు, సోహైల్, రాజేష్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై విస్తృత ప్రచారం

- గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్, పట్టణాల్లో మెప్మా ఆర్పీలు
- కేఎంసీలో దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్
- తొలి రోజే వందల సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న మెప్మా ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకంపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం ప్రారంభమైంది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ఉద్యోగులు, పట్టణ ప్రాంతాల్లో మెప్మా డీఎంసీ, టీఎంసీ, సీవోలు, ఆర్పీలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజీవ్ యువశక్తి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా కౌంటర్‌ను గురువారం ప్రారంభించారు. తొలి రోజే వందల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తులను రికార్డులో నమోదు చేసి వెను వెంటనే మెప్మా ఉద్యోగులు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు ఇలా..

రాజీవ్ యువ వికాసంలో రుణం పొందేందుకు వయస్సు 21 నుంచి 55 ఏళ్ల వరకు అవకాశం కల్పించారు. రూ.2లక్షల లోపు ఆదాయం లేదా తెలుపు రేషన్‌కార్డు కలిగి ఉండాలి, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, దివ్యాంగులు వైకల్య ధృవీకరణ పత్రాలు దరఖాస్తుతో పాటుగా జత చేయాలి. ఆదాయ ధృవీకరణ పత్రం లేని వారు ఆదాయ పత్రం కోసం దరఖాస్తు వివరాలను జత చేయాలి, వాహనాల రుణం కోసం దరఖాస్తులు చేసే వారు డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలి. రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50వేల నుంచి 4లక్షల వరకు రుణం అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, దివ్యాంగులు అర్హులు. ఈ విషయాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయా విభాగాల ఆధ్వర్యంలో పథకంపై ప్రచారం నిర్వహిస్తున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయంగా పని చేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం మండల పరిధిలోని పుల్లయ్యబంజరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, మహిళలకు. ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అదే విధంగా కల్లూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన దయగల గోడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ నిర్వాహకులు ప్రభుత్వ ఉపాధ్యాయులైన దంతాల సుధాకర్, అమర్లపూడి చక్రవర్తిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎల్ రాజేంద్ర గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన శ్రీనువాస రావు, ఆళ్ల నరసింహారావు, కిష్టంశెట్టి ఏడుకొండలు, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర పోరాటంలో ఏనాడూ కనిపించని బీజేపీ గాంధీజీని, ప్రపంచానికి ఆదర్శంగా ఉండే విధంగా రాజ్యాంగం రచించిన డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను అవమానించే విధంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా ఆరోపించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీఆర్.అంబేద్కర్‌ను అవమానించే విధంగా అమిత్‌షా మాట్లాడారని, దీనిపై రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఢిల్లీ నుంచి జిల్లా కేంద్రం వరకు ఆందోళన చేసినా ప్రధాని మోదీ పట్టించుకోలేదని విమర్శించారు. బీజేపీ తీరును ఎండగడుతూ గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని తీసుకువెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పరంగా అమలవుతోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో ఇంటింటికి తిరిగి వివరించాలని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...

సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మట్టా రాగమయి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 4వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని జేవీఆర్ అటానమస్ ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టా దయానంద్ పరిశీలించారు.



వైరాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లికి స్వీట్ బాక్సు అందజేస్తున్న అధికారులు



పెనుబల్లిలో..



కల్లూరులో...

ఘనంగా మా ఇంటి-మణిదీపం కార్యక్రమం

వైరా, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా ఆడపిల్ల మహాలక్ష్మి అని వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ పేర్కొన్నారు. మా ఇంటి-మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిరిపురంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిని అభినందించి గురువారం స్వీట్‌బాక్సు అందజేశారు. అలాగే ఐసీడీఎస్ నుంచి అభినందన పత్రాన్ని అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని మండల స్పెషలాఫీసర్ సునీల్‌రెడ్డి కోరారు. మా పాప మా ఇంటి మణిదీపం పథకంలో భాగంగా గురువారం స్థానిక జంగాల కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఆడపిల్ల జన్మోత్సవ వేడుకలను సత్తుపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, సూపర్‌వైజర్ మహాలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు స్వాతి, రహీమున్నీసా, రాధ, మంగతాయారు, అరుణ, కమల, హెచ్‌వీ శారారాణి, ఏఎన్‌ఎం తాయమ్మ, ఆషావర్కర్ సువర్ణ పాల్గొన్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: ఆడపిల్ల ఇంటికి మహలక్ష్మీ అని ఆడపిల్లలను చులకనభావంతో చూడవద్దని ఏసీడీపీవో ఉషారాణి తెలిపారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొణిజర్లలో ఆడపిల్లకు జన్మనిచ్చిన కుంచెపు రమాదేవి, రాజా దంపతులను గురువారం సన్మానించారు. దంపతులను గౌరవంగా స్వీట్‌బాక్స్, ప్రశాంసాపత్రం అందించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, సూపర్‌వైజర్ కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో

తల్లాడ: తల్లాడ అంగన్‌వాడీ కేంద్రం-4 పరిధిలో గురువారం మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్జాకుమార్, మరియమ్మలను మండల ప్రత్యేక అధికారి జి.శివప్రసాద్ శాలువాతో సన్మానించి స్వీట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఏసీడీపీవో నవ్యశ్రీ, ఈవో కృష్ణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యావతి, రోజా, రత్నకుమారి పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో..

మధిర రూరల్: మధిర మండలం దెందుకూరు ఎస్సీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్ల పుట్టిన తల్లిదండ్రులను సన్మానించి స్వీట్‌బాక్సు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కృష్ణశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్‌నాయక్, స్కూల్ హెచ్‌ఎం శ్యామలరావు, పీహెచ్‌సీ సిబ్బంది వెంకటేశ్వరరావు, లంకా కొండయ్య, పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు: ఆడపిల్ల ఉన్న కుటుంబం బంగారం అని ఏసీడీపీవో రత్తమ్మ అన్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో ఆడపిల్లను జన్మనిచ్చిన బాలింత దుగ్గిరాల శిరీష, ప్రవీణ్ దంపతుల గృహంలో గురువారం ఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డాక్టర్ సదా, సూపర్‌వైజర్లు సుజాత, సంధ్యారాణి, భవానీ, ఏఎన్‌ఎం విజయకుమారి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, మంగామణి, కృష్ణవేణి, యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాఇంటి-మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండాలపాడు గ్రామంలో గాయం శ్రావణి దంపతులకు ఆడపిల్ల జన్మించింది. గురువారం శ్రావణి దంపతులకు మండల ప్రత్యేక అధికారి పురంధర్ స్వీట్‌బాక్సు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంపీవో ఉపేంద్రయ్య, ఐసీడీఎస్ ఏసీడీపీవో మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్లు అనురాధ, రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు శశి, స్వరూప, గోవిందమ్మ, రత్నకుమారి పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో బాగంగా మండలంలోని మోటమర్రి గ్రామంలో గురువారం మండల అధికారులు బలవంతపు సురేష్, కావ్య ఇంటికి వెళ్లి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మీ అని నేటి రోజుల్లో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. ఆడపిల్లల ప్రాధన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, వైద్యాధికారి స్రవంతి, గిర్దావర్ మైథిలి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్‌లో..



బోనకల్‌లో...

గ్రంథాలయం పరిశీలన

ముదిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. గ్రంథాలయానికి పాఠకులు ఎంతమంది వస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో ఎక్కువమంది రావడం లేదని గ్రంథపాలకుడు తెలిపారు. గ్రంథాలయ నూతన భవన నిర్మాణం జరిగే వరకు దీని నిర్వహణను వేరేచోట కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి : డీఎం



సత్తుపల్లి ఆర్టీసీలో చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం బస్టాండ్ ఆవరణలో బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సీతారాముల తలంబ్రాలను పొందేందుకు భక్తులు, డిపో పరిధిలోని ప్రజలకు నేరుగా ఇంటివద్దకే రూ.151చెల్లిస్తే తలంబ్రాలను అందిస్తున్నదని చెప్పారు. వేసవి ఎండల తాకిడి తీవ్రంగా ఉందని, ప్రజలు వేసవి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సిలివేరు సాహితీ, ఎస్‌ఎం ఆనందం, యూనియన్ నాయకులు ఎస్కే.గుమ్మావలీ, నందిపాటి రవి, ఇనపనూరి అబ్రహం, ఎస్కే.బాజీ, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన అడిషనల్ డైరెక్టర్

పెనుబల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి ఆదర్శ పాఠశాలకు అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి గురువారం సందర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి పరీక్షలు ముగిసినందున వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులు ఎక్కువమంది చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని, విద్యార్థులకు మంచి బోధన అందించాలని ఉపాధ్యాయులను కోరారు. గతేడాది 800 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 400 మందికే పరిమితమైందని మరో 400 మంది విద్యార్థులు పాఠశాలలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రూపస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి ఆశయాలు సాధించాలి

» సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

కొణిజర్ల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా చాగం కృష్ణారెడ్డి నిలిచారని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య కొనియాడారు. మండల పరిధిలోని సిద్దిక్‌నగర్ గ్రామంలో గురువారం చాగం కృష్ణారెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, కొప్పుల కృష్ణయ్య, తాళ్ళపల్లి కృష్ణ, చింతనిప్పు చలపతి, కొడబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, సంక్రాంతి నర్సయ్య, దుగ్గి కృష్ణ, మిద్దె రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ సభను జయప్రదం చేయండి

ఏన్కూరు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 13న జరిగే కార్మిక సంఘం టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు ఎస్కే లాల్‌మియా కోరారు గురువారం సివిల్ సప్లయ్ కార్మికులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కొండే వెంకటేశ్వర్లు, నరసింహారావు, పురుషోత్తం, రామారావు, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలను రద్దు చేయడం సరికాదు

» గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శోభన్ నాయక్

కారేపల్లి ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ట్రైకార్ ద్వారా మంజూరు చేసిన రుణాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం పట్ల గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అజ్మీరా శోభన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రైకార్ రుణాలను రద్దుచేయడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయసిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

ఈకార్యక్రమంలో జాటోత్ కిషన్‌నాయక్, మాల శ్రీనునాయక్, అజ్మీర శ్రీను నాయక్, భూక్య పవన్, భూక్య లక్ష్మణ్ మాలతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మధిర రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం మధిరలో రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు, మహిళలు రెవెన్యూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు తహసీల్దార్ రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, సీనియర్ నాయకుడు పాపినేని రాంనర్సయ్య, మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర, నాయకులు వూట్ల శంకరయ్య, రాధాకృష్ణ, మండవ ఫణీంద్రకుమారి, మధు, లాలు, అమరయ్య పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు

నాయకుల ముందస్తు అరెస్టు

ముదిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్, విద్యార్థి సంఘ నాయకులను గురువారం ముదిగొండ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని, అరెస్టైన విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన

కారేపల్లి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి నవీన్ మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీలలో ముందుగా పథకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల వితరణ

కారేపల్లి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోకాళ్లగుంపు ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు టీషర్టులను వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన బానోత్ వంశీ-దివ్య దంపతుల కుమార్తె మౌక్తికనైరా జన్మదినం సందర్భంగా విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం. అజ్మీరా వీరునాయక్, మాజీ సర్పంచ్ ధారవత్ భద్రునాయక్, గుగులోత్ తేజ్యా నాయక్, కామల్ల సుందరయ్య, అజ్మీరా దశ్రు నాయక్, అంగోత్ రమేష్, వర్షమోహన్, అజయ్, నాగమణి, సుజాత పాల్గొన్నారు.

రేణుక, ఎల్లమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ

బోనకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన రేణుక, ఎల్లమ్మ తల్లి దేవాలయంలో విగ్రహా ప్రతిష్ఠా మహోత్సవంతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠను నిర్వాహకులు కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వైద్యులు ఈసంపల్లి వెంకటేశ్వర్లు, రోజారమణి దంపతులు రేణుక, ఎల్లమ్మ తల్లి పురాతన ఆలయాన్ని తొలగించి నూతనంగా దేవాలయాన్ని స్వయంగా నిర్మించారు. ఆలయంలో రేణుక, ఎల్లమ్మ తల్లి విగ్రహాలతో పాటు తిరుపతమ్మ, మైసమ్మ, గంగమ్మ, నాగేంద్ర స్వామి, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమంతో పాటు ప్రత్యేక పూజలు, శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోనకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చేబ్రోలు జనార్ధన్‌రావు(బుజ్జులు) ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని గురువారం టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, నాయకులు బాగం రమేష్, సాదినేని హన్మంతరావు, మరీదు బరకయ్య, రావూరి మంగయ్య, తూము పురుషోత్తమరావు, వట్టికొండ నవీన్, పారా వెంకటేశ్వరరావు, ధనుంజయ్, పులగం హన్మంతరావులు పరామర్శించారు. జానర్దన్ లేని లోటు పార్టీకి తీరనిదిగా అభివర్ణించారు.

నిబంధనలు పాటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ చౌకదుకాణాల్లో కేంద్ర ప్రభుత్వ నిబంధనలు పాటించేలా అధికారులు దృష్టి సారించాలని కల్లూరు మండల బీజేపీ నాయకులు కోరారు. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణతో పాటుగా నాయకులు కలిసి తహసీల్దార్‌కు వినతి ప త్రం అందించారు. ఈ కార్యక్రమలో బిజెపి నాయకులు గుండపనేని అనిల్, మండవ వెంకట్రామిరెడ్డి, జాల అప్పారావు, దేవర రమేష్, బానోతు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాలని వినతి



డీజీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కారేపల్లి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం పంచాయతీలో మంజూరైనా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం డోలమెంట్ మైన్ డీజీఎం బీయూవీఎన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. మాధారం, గోవింద్ తండా గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాలతో రూ.3కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనుమతులు వచ్చాయి. అయితే సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం మైన్స్‌లో స్థలం ఏర్పాటుచేయాలని గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ ఆధ్వర్యంలో మైన్స్‌లో డీజీఎంను కలిసి స్థలం కేటాయించాలని కోరారు. దీంతో విశాఖస్టీల్ ప్లాంట్ సీఎండీకి వివరించి తగిన స్థలం కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీరునాయక్, కొల్లి వీరయ్య, మంకిని చిన్నసైదయ్య, పాపిన్ని సత్యానారాయణ, కాసాని లక్ష్మీనారాయణ, పోతనపోయిన రవి, రావుల నాగయ్య, కావేటి నాగయ్య పాల్గొన్నారు.

10 నుంచి అన్నారుగూడెంలో అంకమ్మజాతర

తల్లాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఈనెల 10నుంచి 14వతేదీ వరకు అంకమ్మజాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు దొడ్డా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఐదు రోజులపాటు వివిధ రూపాల్లో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 12,13,14తేదీల్లో మహాఅన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆలయకమిటీ సభ్యులు మారెళ్ల దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పేరసాని నర్సింహారావు, దుగ్గినేని సత్యనారాయణ, దొబ్బల శ్రీనివాసరావు తదితరులున్నారు.

భగవద్గీత పోటీల్లో ప్రతిభ

ఏన్కూరు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆన్‌లైన్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఏన్కూరు పట్టణానికి చెందిన మాదినేని ఉషారాణి అత్యంత ప్రతిభ చూపి బంగారుపతకం సాధించింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని దిండిగల్‌లో దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామివారి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. మార్చి 13న కర్ణాటకరాష్ట్రం మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉషారాణి 18అధ్యాయాలు, 700 శ్లోకాలను అలవోకగా కంఠస్తం చేసి అబ్బురపరిచింది. రోజుకు 14గంటలు 8నెలలు శ్రమించి ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించింది. ఈసందర్భంగా ఉషారాణి ఏఎంసీ ఛైర్మన్ గుత్తా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ కోపెల శ్యామల, శివాలయం కమిటీ ఛైర్మన్ వేముల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు కొప్పుల ప్రభావతిరెడ్డి, పెరసాని జ్యోతి, టీడీపీ నాయకులు తాళ్లూరి అప్పారావు, పొన్నం హరికృష్ణ, తదితరుల అభినందించారు



బంగారు పతకం అందుకుంటున్న ఉషారాణి

వరి పంట పరిశీలన

చింతకాని, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఎన్ఎఫ్ఎస్ఎం ద్వారా పంపిణీ చేసిన ఎంటీయూ 1010 వరి పంటను మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర గురువారం పరిశీలించారు. వరిలో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈవో ఆయేషా పాల్గొన్నారు.

ఉప్పునూరి కుటుంబానికి రాయల పరామర్శ

ముదిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉప్పునూరి వెంకటరెడ్డి మాతృమూర్తి వెంకట్రావమ్మ ఇటీవల మృతిచెందగా గురువారం ఆమె దశదినకర్మలు జరిగాయి. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు వెంకట్రావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బులెట్ బాబు, రవీందర్‌రెడ్డి, పల్లపాటి కృష్ణ, శంబయ్య, ఉసికల రమేష్, అజ్గర్ పాల్గొన్నారు.

ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీవో ఆశాలత

ముదిగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని డీపీవో ఆశాలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. నూరుశాతం ఇంటిపన్నులు వసూలుచేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలో చేసే పనుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీవో వాల్మీకి కిషోర్, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ గద్దెలకు శంకుస్థాపన

బోనకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం సమ్మక్క, సారలమ్మ గద్దెల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బందం నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. చొప్పకట్లపాలెం గ్రామవాసి బోయినపల్లి ఉమాదేవి సొంత ఖర్చులతో గద్దెల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతో ఆమెను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీడీపీ గ్రామశాఖల అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బందం హుస్సేన్, బీఆర్ఎస్ కార్మిక విభాగ మండల అధ్యక్షుడు బందం నాగేశ్వరరావు, దొడ్డా మురళి, శాస్త్రీ, తిరపతిరావు పాల్గొన్నారు.